వాక్ వే సుందరీకరణకు ప్రతిపాదనలు

అధికారులతో కలిసి కేబీఆర్ పార్క్‌లో పర్యటిస్తున్న జడ్పీ అనురాగ్ జయంతి

వెంగళరావునగర్, ఆగస్టు 8 :కేబీఆర్ పార్క్ వాక్ వే సుందరీకరణకు ప్రతిపాదనలు రూపొందించాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం కేబీఆర్ పార్క్ వాక్ వేలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఆహ్లాదకరమైన రీతిలో పార్కు వాక్ వేను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్-18 ప్రశాంతి,ఈఈ విజయ్‌కుమార్, వెటర్నరీ అధికారి చక్రపాణి, అధికారులు ఇంద్రదీప్, బాలయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా బడ్జెట్ నాలెడ్జ్ టెస్ట్

బహుమతులు పొందిన విద్యార్థులు

ఖైరతాబాద్, ఆగస్టు 8 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, అనలాల్ ఐఏఎస్ అకాడమీ, అశోక్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బడ్జెట్‌పై నాలెడ్జ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై టెస్ట్ నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఆర్థిక విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం మొదటి బహుమతి శ్రీకాంత్(ప్రభుత్వ కళాశాల, ఖైరతాబాద్)కు రూ.3,500 నగదు, రెండో బహుమతి కల్యాణ్‌రాజ్(నిజాం కళాశాల)కు రూ. 2,500, తృతీయ బహుమతి ప్రాచి గోయల్(అవినాశ్ కాలేజ్ ఆఫ్ కామర్స్)కు రూ. 1,500 నగదు అందజేశారు. పలువురికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు.

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

• నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణాశ్రీనివాస్

నార్సింగి పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణాశ్రీనివాస్

వెంగళరావునగర్ : షేక్‌పేట్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మణికొండ, ఆగస్టు 8: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణాశ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'స్వచ్ఛదనం -పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్లూక్రాస్ సోసైటీ వారు కుక్క కాటును అరికట్టడంపై వివరించారు. నార్సింగి, కోకాపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోగాలు దరి చేరకుండా ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు.

కార్యక్రమంలో వైస్ చైర్మన్ విజయబాబు, మున్సిపల్ కమిషనర్ టి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ యోగేశ్, బ్లూ క్రాస్ సోసైటీ డైరెక్టర్ కుమారి, వెటర్నరీ డాక్టర్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి : ర్యాలీలో ఉప కమిషనర్ రవికుమార్, అత్తాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

అత్తాపూర్‌లో ర్యాలీ

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థులు చదువుతూనే అన్ని రంగాల్లో పాలుపంచుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ సూచించారు. గురువారం అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛదనం- పచ్చదనం'లో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థులు ఇంటి వద్ద మొక్కలు నాటాలని పేర్కొని మొక్కలను పంపణీ చేశారు. అనంతరం ఉపకమిషనర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు నాటాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వెంగళరావునగర్: పటేల్ నగర్‌లో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్

వెంగళరావునగర్ : జూబ్లీహిల్స్ డివిజన్ పటేల్ నగర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో గురువారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. బోనాల పండుగకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, ఎస్ఎస్ అమిత్‌కుమార్, మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైరతాబాద్ : తుమ్మలబస్తీలో చెత్తను తొలగింపజేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు

తుమ్మలబస్తీలో..

ఖైరతాబాద్ : ఖైరతాబాద్ డివిజన్ తుమ్మలబస్తీలో గురువారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుపై ఉన్న వ్యర్థాలు, మట్టికుప్పలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్-17 డిప్యూటీ కమిషనర్ జగన్, యూబీడీ మేనేజర్ జ్యోష్న, సూపర్‌వైజర్ శ్రీకాంత్, సమైక్య భారతి యువత అసోసియేషన్ అధ్యక్షుడు కె. నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కళాకారులకు ఉద్యోగావకాశాలు కల్పించండి

మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, ఆగస్టు 8: రాష్ట్రంలో కళాకారుల సమస్యలను పరిష్కరించి అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రజా నాట్య మండలి ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. కళాకారులకు గుర్తింపు కార్డులు,హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కవులు,కళాకారులతో త్వరలోనే సమావేశం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, నాయకులు లక్ష్మినారాయణ, ఉప్పలయ్య, రమేశ్, పి. సైదులు, పద్మావెంకటేశ్, రాజమౌళి పాల్గొన్నారు.

మహాసంప్రోక్షణ ఉత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి: అత్తాపూర్ డివిజన్ చైతన్య విల్లాస్ కాలనీలో సీతారామచంద్రస్వామి ఆలయ మహాసంప్రోక్షణ ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. గురువారం ఉదయం వివిధ పూజలు, ఆరాధనలు, తీర్థప్రసాద వితరణ, శ్రీ హనుమత్ సేవిత కోదండరామస్వామి, విమాన కలశ ప్రతిష్ఠ, వరసిద్ధి వినాయకస్వామి, సూర్యాధి నవగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

దేశ సేవలో తరిద్దాం..

• జాతీయ పదాధికారుల శిక్షణలో ఐఏఎస్ ఉదయ్‌కుమార్

శిక్షణ అనంతరం పదాధికారులతో ఐఏఎస్ ఉదయ్‌కుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 8 : దేశంలో శాంతి సామరస్యాలను కాపాడు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని రాష్ట్ర రిజిస్ట్రార్ ఆఫ్ కోఆర్డినేటర్, కార్యదర్శి, ఐఏ ఎస్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్(ఐసీఎం) ఆడిటోరియంలో దేశ వ్యాప్తంగా పదాధి దళ సైనిక(ఆర్మీ, నేవీ,ఎయిర్‌ఫోర్స్) అధికారులకు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి సేవ చేసే ఉద్యోగ అవకాశం రావడం అదృష్టంగా భావించాలని అన్నారు. పదాధిదళ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఉద్యోగ విరమణ అనంతరం మన హోదా, గౌరవమే ఆర్థికంగా ఎదిగేందుకు అనేక మార్గాలు చూపుతుందన్నారు. రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్ టీ.శ్రీనివాస్ మాట్లాడుతూ మనం ఎంచుకున్న రంగమే మనలను కాపాడుతుందన్నారు. పదవీ విరమణ అనంతరం అనేక ఉపాధి, ఆర్థిక వనరులున్నాయని, నాలుగు నెలల శిక్షణలో అకౌంటింగ్, కాస్టింగ్, మార్కెటింగ్, బిజినెస్ మోడల్స్‌పై అవగాహన కల్పిస్తామని ఐసీఎం డైరెక్టర్, డాక్టర్ ఆర్. గణేషన్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సురేశ్ తెలిపారు. శిక్షణకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మరో ఎనిమిది రాష్ట్రాల నుంచి అధికారులు హాజరయ్యారు.

సమస్యలపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి

జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 8: ప్రజా సమస్యల పరిష్కారంలో తగిన చర్యలు చేపట్టాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ అమ్రపాలితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై కమిషనర్ అమ్రపాలికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మైలార్‌దేవ్‌పల్లిలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయన్నారు. నూతన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, వీధి దీపాలు, తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.

నాలాల్లో ముమ్మరంగా పూడికతీత

పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీసీ సేవా ఇస్లావత్, ఈఈ రాజ్‌కుమార్, తదితరులు

వెంగళరావునగర్,ఆగస్టు 8 : పూడికతీత పనులను సత్వరమే పూర్తి చేయాలని యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. గురువారం సర్కిల్ పరిధిలోని నాలాల్లో చేపడుతున్న డీసిల్టింగ్ పనులను ఈఈ రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. వరద ముప్పు తలెత్తకుండా.. వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా నాలాల్లో పూడికతీత పనులు చేపడుతున్నామని ఈఈ తెలిపారు. వారి వెంట డిప్యూటీ ఈఈ శ్రీరాములు, రామచంద్రరాజు, ఏఈలు భరత్, అవినాశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్డీఓకు వినతులు

ఆర్డీఓ దశరథ్‌సింగ్ రాథోడ్‌కు వినతిపత్రాలు ఇస్తున్న కార్పొరేటర్లు వెంకటేశ్, సీఎన్ రెడ్డి

వెంగళరావునగర్, ఆగస్టు 8 : జూబ్లీహిల్స్ డివిజన్ వినాయక్‌నగర్‌లోని పర్వతాంజనేయస్వామి టెంపుల్ వద్ద ప్రభుత్వం స్థలంలో వెలసిని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని గురువారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్ రాథోడ్ వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఇలాగే అక్రమ నిర్మాణాలు చేపట్టగా పోలీసులు కేసులు నమోదు చేశారని.. అయినప్పటికీ నిర్మాణాలు ఆగడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఫిలింనగర్‌లో ఏండ్ల తరబడి అద్దె ఇండ్లలో నివాసముంటున్న పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. లేకుంటే కోర్టుకు వెళ్తామన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీని వేగవంతం చేయాలి

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇప్పటికే ఖైరతాబాద్ మండల రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించి విచారణ పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే ఇండ్ల పంపిణీ చేపట్టాలని ఆయన ఆర్డీఓకు రహ్మత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో విన్నవించారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 8: ఏటీఎంలో చోరీకి ఓ వ్యక్తి విఫలయత్నం చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గణేష్‌నగర్ ప్రాంతంలో యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలోకి గురువారం ఉదయం ఓ వ్యక్తి చొరబడి డబ్బులు కాజేసేందుకు రెండు గంటలపాటు విఫలయత్నం చేశాడు. ఏటీఎంను ఇనుప రాడ్‌తో బద్దలు కోట్టేందుకు ప్రయత్నించగా అలారం మోగడంతో పారిపోయాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా ఫ్లాట్ మాకు ఇప్పించండి.. సారూ..!

మాట్లాడుతున్న లక్ష్మి కుటుంబసభ్యులు

హిమాయత్‌నగర్, ఆగస్టు 8: 'మా ఫ్లాట్‌ను ఆక్రమించుకుని బెదిరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని అని ఓ కుటుంబం ప్రభుత్వాన్ని వేడుకుంది. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో బాధిత మామిడిశెట్టిలక్ష్మి, అబ్బు దంపతులు మాట్లాడుతూ చిలకలగూడలోని జై హనుమాన్ లాండ్ మార్క్ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో తమకు ఫ్లాట్ ఉందని తెలిపారు. స్థానికుడు ప్రభాకర్ అనే వ్యక్తి తమ ప్రమేయం లేకుండా ఫ్లాట్‌లోకి చొరబడి ఆ ఫ్లాట్‌లో ఉంటున్న వ్యక్తిని బలవంతంగా ఖాళీ చేయించాడని పేర్కొన్నారు. ఈ విషయమై చిలకలగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభాకర్‌తో ఏసీపీ జైపాల్‌రెడ్డి కుమ్మక్కై తమను వేధిస్తున్నారని, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు

హిమాయత్‌నగర్, ఆగస్టు 8: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024-2025 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సులో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు నారాయణగూడ బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండేళ్ల ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 18లోగా రిజిస్ట్రేషన్ చేసుకుని, సంబంధిత సర్టిఫికెట్స్‌తో కాలేజీలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. తర్వాత ఆన్‌లైన్ ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. రెండు, మూడో సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించని వారు ఈ నెల 18 లోగా చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 7382929630 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

మణికొండ,ఆగస్టు 8:రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేట్ ఎస్ఏఎస్ బిల్డింగ్ ఎదుట ఓఆర్ఆర్ రింగ్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తం మడుగులో ఉన్న ఆ వ్యక్తిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని తెలిన్నారు. మృతుడి కుడి చేతిపై లవ్ సింబల్ యారో మార్కు పచ్చ బొట్టు ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు 9490617189 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఫార్మ్‌డీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 8: ఓయూ పరిధిలోని ఫార్మ్‌డీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఫార్మ్‌డీ మూడో ఏడాది, ఆరేండ్ల ఫార్మ్‌డీ ఆరో సంవత్సరం మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 16 లోగా చెల్లించాలన్నారు. మూడేండ్ల ఫార్మ్‌డీ మొదటి, రెండో సంవత్సరం, ఆరేండ్ల ఫార్మ్‌డీ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సంవత్సరం మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 21వరకు చెల్లించవచ్చన్నారు.

ఐక్యంగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

• స్పీకర్ గడ్డం ప్రసాద్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, నాయకులు

మణికొండ, ఆగస్టు 8: అంతా ఐక్యంగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారు, పాత వారు అనే తేడా లేకుండా కలిసి పని చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. అభివృద్ధికి తనవంతు సహకారం అందించి,నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకోని పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, మాజీ ఎంపీపీ మల్లేశ్, టీపీసీసీ కార్యదర్శి జైపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మాజీ చైర్‌పర్సన్ రేఖ, మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నాయకులు సాగర్‌గౌడ్, నర్సింహా, హరిశంకర్, కిరణ్, శ్రీనివాస్, గణేశ్, యాదగిరి పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



21వ వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుష్మారెడ్డి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 8 : శంషాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి దశల వారీగా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 21,22 వార్డుల్లో రూ. 25 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి దశల వారీగా కృషి చేస్తున్నట్లు వివరించారు. మున్సిపాలిటీలో ఏండ్లుగా నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించామని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్, కమిషనర్ సుమన్‌రావు,కౌన్సిలర్లు అజేయ్, శ్రీకాంత్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణకు చొరవ చూపాలి

• వీహెచ్‌పీ ప్రచార ప్రసార ప్రముఖ్ బాలస్వామి

సమావేశంలో మాట్లాడుతున్న బాలస్వామి

ఖైరతాబాద్, ఆగస్టు 8 : బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువుల రక్షణకు కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి కేంద్రాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తన పదవీకి రాజీనామా చేసి దేశ విడిచిన తర్వాత అరాచక శక్తులు హిందువులపై దాడులు చేస్తున్నారన్నారు. గతకొన్ని రోజులుగా దేవాలయాలు, మతపరమైన స్థలాలు, వ్యాపారసంస్థలు, ఇండ్లపై దాడులు చేస్తున్నారన్నారు. చివరకు హిందూ శ్మశానవాటికలను సైతం ధ్వంసం చేస్తున్నారన్నారు. ఆ దేశంలో మైనార్టీలపై దాడులు, మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నా లౌకికవాద శక్తులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువుల రక్షణ కోసం భారత ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, లౌకికవాద, ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడేలా ప్రపంచ దేశాలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ నాయకులు సుభాష్‌చందర్, అనిల్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు హేయం..

హిమాయత్‌నగర్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగడం అత్యంత హేయమైన చర్య అని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు భార్గవిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమాయకులైన హిందువులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అల్లరి మూకలు విధ్వంసాలకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అని, ఆ దేశ మిలటరీ రంగంలోకి దిగి హిందువులను కాపాడాలని కోరారు.

యజమాని ఇంటికే కన్నం

రూ. 5.85లక్షలు కాజేసినవాచ్‌మెన్

వెంగళరావునగర్, ఆగస్టు 8 : నమ్మకంగా అద్దెకు ఉంటూ యజమాని ఇంటికే కన్నమేశాడు. కాపలాగా ఉండే వాచ్‌మెన్ మారుతాళాలతో లక్షల రూపాయలు కాజేశాడు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ డీ బ్లాక్‌లో ఉండే వ్యాపారి డి.అనంతనాగ్ తన కన్‌స్ట్రక్షన్ బిజినెస్ కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఉద్యోగులు పలుమార్లు బ్యాంకులో డబ్బు జమ చేయడానికి వెళ్లగా కొంత డబ్బు గల్లంతు కావడాన్ని గుర్తించారు. కొద్ది రోజుల అనంతరం కార్యాలయంలోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా వాచ్‌మెన్ నాగేందర్ మారు తాళాలతో డబ్బును చోరీ చేసినట్లు గుర్తించారు. మొత్తం రూ. 5.85 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

'రా రైస్ మిల్లర్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు'

సమావ